క్లుప్తంగా

నాడు-నేడు పనుల పరిశీలన



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈవో రామచంద్రరావు

డుంబ్రిగుడ: మండలంలోని సోమవారం పోతంగి, బోడిగుడ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో రామచంద్రరావు సోమవారం సందర్శించారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేపడుతున్న నాడు–నేడు పనులను వేగవంత చేయాలని ఆదేశించారు. పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం చేసినా ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్తామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట సీఆర్పీ సింహ బాలుడు ఉన్నారు.

గ్రామ వలంటీర్లకు పురస్కారాలు రేపు

గూడెంకొత్తవీధి: ఉత్తమ సేవలందించిన గ్రామ వలంటీర్లకు గూడెం కొత్తవీధి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి చేతుల మీదుగా పురస్కారాలు అందజేయనున్నట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులంతా హాజరుకావాలని కోరారు. అదే రోజు ఎమ్మెల్యే రింతాడలో గడప గడపక మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈ నెల 27వరకూ మండలంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో మంగళవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పర్యటించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి తెలిపారు. స్థానికంగా జరగనున్న దివ్యాంగుల ఉచిత వైద్య శిబిరంతో పాటు వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొవాలని కోరారు.

నేడు యూత్ క్యాంప్

డుంబ్రిగుడ: మండలంలోని లైగండ పంచాయతీ కేంద్రంలో పాస్టర్ శామ్యూల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ఎల్–షడ్డాయ్ హోలీ టెంపుల్ చర్చి వద్ద యూత్ క్యాంప్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సోమవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆరాధన, సువార్త కూటమి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని క్రైస్తవులు తరలిరావాలని కోరారు.

గిరిజనుల చెంతకు పోస్టల్ సేవలు

చింతూరు: మన్యంలో ప్రతి గిరిజన కుటుంబానికి పోస్టల్ సేవలు చేరువ చేసేందుకు వన జన ధన్ పేరుతో వినూత్న పథకాన్ని చేపడుతున్నట్టు పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ నారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద వంద రోజుల పోస్టాఫీసు చిన్న మొత్తాల పొదుపు సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. చింతూరు పోస్టల్ డివిజన్ పరిధిలో 754 గ్రామాల్లోని 85 వేల గృహాల్లో ప్రతి కుటుంబానికి వంద శాతం పోస్టాఫీసు పొదుపు ఖాతా, బీమా పాలసీ లక్ష్యంగా కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ సౌకర్యాన్ని అందరూ వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఉన్న శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గ్రంథాలయాధికారి శెట్టి సునీత ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుతులు కూడా అందజేస్తామన్నారు.

నేడు మండల సమావేశం

వీఆర్ పురం: మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎం.రత్న కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కారం లక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తగిన సమాచారంతో హాజరు కావాలన్నారు.

జగనన్నతోనే ప్రజా సంక్షేమం సాధ్యం



గ్రామస్తులకు పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



గిరిజనులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

జి.మాడుగుల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఏఎస్సార్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలో గడుతూరు పంచాయతీలో మాసింగిమెట్ట, గొడ్డ, పచ్చనాపల్లి, గడుతూరు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆయా గ్రామాల్లో 230 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి జగన్ పాలనకు మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పార్టీలకతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సీఎం జగనన్న కోరుకుంటే దాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని న్నారు. పేదవాడెప్పుడూ పేదవాడిగానే ఉండాలని చంద్రబాబు ఆలోచన అని అందుకే పేదలకిచ్చే ఇళ్ల దగ్గర నుంచి సంక్షేమ పథకాలన్నింటిని అడ్డుకునేందుకు శత విధాల ప్రయత్నిస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు. దీన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు ప్రతిపక్ష పార్టీలకు సరైన విధంగా గుణపాఠం చెబుతారన్నారు. మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా ఎన్నుకొనేందుకు ప్రజలు కంకణబద్ధులై ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ఆమె వెంటనే పరిష్కరించారు. సర్పంచ్‌లు కిముడు రాంబాబు, సీదరి కొంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండంనాయుడు, కన్వీనర్ లక్ష్మణ్‌పడాల్, నాయకులు చంద్రపతి, మత్స్యకొండబాబు, సత్యనారాయణ శంకరరావు, బాలకృష్ణ, ప్రతాప్‌కుమార్, తరుణ్‌కుమారి, బాలరాజు, అధికారులు, గ్రామ వలంటీర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన తండాలో 'గడప గడపకు' విశేష స్పందన

అనంతగిరి: ఎండలు మండుతున్న లెక్కచేయకుండా శివారులోని గిరిజన తండాలకు కాలినడకన వెళ్లిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు అడవిబిడ్డలు ఘన స్వాగతం పలికారు. మండలంలోని మారుమూల పైనంపాడు పంచాయతీ ఎగువసోనభ, దిగువసోనభ, దోండలవలస, బల్లమామిడి, దుర్గం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాల్గుణ ఇంటింటికీ వెళ్లి గిరిజనులను ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్రజలతోనే అనునిత్యం ఉండేలా గడప గడప కార్యక్రమం ద్వారా మంచి అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం గ్రామాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజన మారుమూల గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, సమాచార వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక కృషి చేసిందని కొనియాడారు. ఇది ప్రజల ప్రభుత్వమని, మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, ఎంపీటీసీ తమ్మన్న, సర్పంచ్‌లు సన్యాసిరావు, సీమ, పంచాయతీ కన్వీనర్లు సుబ్బారావు, బొజ్జన్న, రేవతి, మాజీ వైస్ ఎంపీపీ గుండన్న, మాజీ ఎంపీటీసీ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం



బాధితులకు వంటసామగ్రి అందజేస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు, ప్రజాప్రతినిధులు

చింతూరు: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి అన్నారు. మండలంలోని బొడ్రాయిగూడెంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాద బాధితులైన పులి బ్రహ్మయ్య, మిడియం ముత్తమ్మ కుటుంబాలను ఎస్టీ కమిషన్ సభ్యుడితో పాటు వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ పేదలైన గిరిజన కుటుంబాలు ఈ ప్రమాదంలో సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. బాధిత కుటుంబాలకు మానవతా దృక్పథంతో దాతలు కూడా సాయం అందించాలని వారు కోరారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు రూ.10 వేల విలువైన దుస్తులు, నిత్యావసరాలు, వంట సామగ్రి అందచేశారు. ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, కో–ఆప్షన్ మెంబర్ ఎండీ అక్బర్‌అలీ, సర్పంచ్ అమ్మాజీ, నాయకులు కోట్ల కృష్ణ, పండా నాగరాజు, లక్ష్మయ్య, విప్లవ్‌కుమార్, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోఎఫ్ఆర్ పట్టాదారులకు రుణాలు



కో–ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న సూరిబాబు

కొయ్యూరు: ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు కలిగిన రైతులకు రుణాలు ఇవ్వాలని కొయ్యూరు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సుమర్ల సూరిబాబు నర్సీపట్నం కో–ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ నాయుడుని కోరారు. ఆయన సోమవారం మేనేజర్‌ను కలిశారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలకు రుణాలు ఇవ్వకపోవడంతో గిరిజన రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వారితో పాటు చిరు వ్యాపారులకు కూడా రుణాలు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. దీనిపై మేనేజర్ సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలో ఆయన కొయ్యూరు వచ్చి ఇక్కడ విషయాలను పరిశీలిస్తారని తెలిపారన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు సిగ్గుచేటు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాంబాబు, నాయకులు

పాడేరు రూరల్ : రాష్ట్రంలోని అన్ని వర్గాల పేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటుంటే చూస్తూ ఓర్వలేక టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు దుర్మార్గమైన వాఖ్యలు చేయడం సిగ్గు చేటని, ఆయా వాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు స్పష్టం చేశారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు సోమవారం ఆమె క్యాంపు కార్యాలయంలో మండల పార్టీ కార్యవర్గం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి, అమలుచేస్తుంటే చూసి ఓర్వలేక పేదలపై అహంకార ధోరణిలో చంద్రబాబు నాయుడు మాట్లాడటం దారుణమన్నారు. ఇకపై టీడీపీ నాయకులు, ప్రతిపక్ష నేతలు చౌకబారు వాఖ్యలుచేస్తే సహించేది లేదన్నారు. జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ ఎం.సరస్వతి, ఎంపీటీసీ సభ్యురాలు సల్లా చిట్టమ్మ, మాజీ సర్పంచ్ మినుముల కన్నాపాత్రుడు, జి.మాడుగుల మండల పార్టీ అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండం నాయుడు, యువజన పార్టీ విభాగ అధ్యక్షుడు కొట్టగుల్లి కొండాజీ, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగ నియోజకవర్గ కో–కన్వీనర్ అల్లాడ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని శివాలయం కొండపై వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు సురేష్‌కుమార్, వీరస్వరూప దంపతులచే స్వామి వారికి పూజలు, కల్యాణ వేడుక నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు కమిటీ సభ్యులు చిన్నారి, లక్ష్మణ్, శివ తదితరులు చెప్పారు.

జేవీకే కిట్ల పరిశీలన



జేవికె కిట్లను పరిశీలిస్తున్న ఎంపీడిఓ విఠల్‌పాల్

ఎటపాక: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లను ఎంపీడీఓ విఠల్‌పాల్, ఏపీఎం స్వామి సోమవారం పరిశీలించారు. 2023–24 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం సరఫరా చేసిన జేవీకే కిట్లను స్థానిక విద్యా వనరుల కేంద్రం గోడౌన్‌లో భద్రపరిచారు. ఇప్పటి వరకు 18,162 పాఠ్యపుస్తకాలు, 19,074 నోట్ పుస్తకాలు, 3,988 బెల్టులు, బ్యాగులను విద్యా శాఖకు అందజేశారు. వాటి నాణ్యత ప్రమాణాలను అధికారులు పరిశీలించి కిట్లు విద్యార్థులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంఈవో నీలి బాలరాజు, సిబ్బంది ఉన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి



మాట్లాడుతున్న పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్

అరకులోయ రూరల్: వ్యవసాయ రుణాలు పొందిన రైతులు సకాలంలో చెల్లించి కొత్త రుణాలు పొందాలని అరకులోయ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తిన కుమార్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 1889 మంది రైతులకు రూ.50 లక్షలు వ్యవసాయ రుణాలు అందించామన్నారు. అప్పు పొందిన రుణాలు సకాలంలో తిరిగి చెల్లిస్తే కొత్తరుణాలు తీసుకొనేందుకు అర్హులన్నారు. సకాలంలో రుణాలు చెల్లించి బ్యాంక్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. అర్హులైన పట్టాదారు రైతులు సభ్యత్వం పొంది వ్యవసాయ రుణాలు పొందాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీఏసీఎస్ బ్యాంక్ కార్యదర్శి అభిన్న తదితరులున్నారు.

రోడ్డు నిర్మించాలని వినతి

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి పంచాయతీలోని గొడుగురాయి గ్రామం నుంచి గెమ్మెలి సచివాలయం వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం గ్రామస్తులు పాదయాత్ర నిర్వహించారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్నపడాల్ మాట్లాడుతూ గొడుగురాయి గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఐదు కిలోమీటర్లు దూరం నడిచి పంచాయతీ కేంద్రంలోని గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. సన్యాసిదొర, పిన్నంనాయుడు, వెంకట్, శ్రీలత, సత్తిబాబు, చిన్నబ్బాయి, అప్పనదొర, సింహచలం తదితరలు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో వచ్చే నెల 6,7,8 తేదీల్లో నిర్వహించనున్న గిరిజన సంఘం మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని గిరిజన ఉద్యోగుల సంఘం భవనంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మహాసభల పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలదేవ్, గిరిజన ఉద్యోగుల సంఘం నేతలు త్రినాథరావు, నందొ, చిట్టిబాబులు మాట్లాడుతూ గిరిజన చట్టాల అమలు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ తదితర అంశాలపై మహాసభల్లో చర్చించనున్నట్టు తెలిపారు. మహాసభల్లో గిరిజనులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గిరిజన ఉద్యోగ ప్రజా సంఘాలు విద్యార్థి సంఘం నాయకులు రఘునాథ్, లైకోన్, మహేశ్వరావు, రామారావు, ధర్మ, శెట్టి బొంజిబాబు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

దారాలమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

మోతుగూడెం: దారాలమ్మ తల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి జన్మదిన వేడుకలను తిథి ప్రకారం సోమవారం నిర్వహించినట్టు ఆలయ అర్చకులు అవినవిల్లి కుమారస్వామి శర్మ చెప్పారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు జరిపామన్నారు. కార్యక్రమంలో భాగంగా పొల్లూరు వాసులు పేపకాయల శ్రీను దంపతులు, చావ్వకుల రమేష్ దంపతులు అమ్మవారికి రూ.5వేల విలువ గల పట్టీలను బహూకరించారని చెప్పారు. మహిళా భక్తులకు తాంబూలం అందజేశామన్నారు. మోతుగూడెం పొల్లూరు, చింతూరు నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారన్నారు. ఆలయ ధర్మకర్తలు వేంకటేశ్వర్లు, రమేష్, శివరామకృష్ణ శ్రీను. రమణ, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి చింతాలమ్మ తల్లి ఉత్సవాలు



మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కొయ్యూరు: చింతాలమ్మ తల్లి ఉత్సవాలను ఈనెల 25 నుంచి నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఘటాల ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. కొయ్యూరు, గొలుగొండ మండలాలకు చెందిన మోటారు యూనియన్ నేతలు ఏటా ఉత్సవాలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. నాలుగు రోజులపాటు జరగనున్న ఉత్సవాలకు అని ఏర్పాట్లు చేశామని, అధిక సంఖ్యలో భక్తులు తరలి రావాలని కోరారు.

రామరాజ్యం సేవలు మరువలేనివి

కొయ్యూరు: ప్రముఖ సీపీఐ నాయకుడు, మాజీ ఎంపీపీ బడుగు రామరాజ్యం వర్ధంతిని కించవానిపాలెంలో ఆయన సమాధి వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బడుగు రమేష్ తదితరులు రామరాజ్యం స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు, గిరిజనుల కోసం నేత రామరాజ్యం న్యాయ పోరాటలు చేశారని, ఆయన చేసిన సేవలు మరువలేనివని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. సీపీఐ నేతలు వెంకటరమణ, సత్యనారారయణ, కనకరకాజు, రమేష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె విరమణ

పాడేఊ రూరల్ : తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కారానికి కోరుతూ ఏపీ వైద్య విధాన పరిషత్ పరిధి జిల్లాలోని ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికులు చేపడుతున్న సమ్మెను సోమవారం విరమించారు. టీవీటీ కాంట్రాక్టర్ నారాయణ సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులతో చర్చలు జరిపారు. సకాలంలో వేతనాల చెల్లింపు, ఈపీఎఫ్, ఏఈఎస్ఐ సమస్యతో పాటు యూనిఫాం, సేఫ్టీ పరికరాల పంపిణీ, జీతాల పెంపు తదితర అంశాలపై కాంట్రాక్టర్ లిఖితపూర్వక హామీ ఇచ్చారు. దీంతో కాంట్రాక్టర్ నారాయణ కార్మికులకు నిమ్మరసం ఇచ్చి సమ్మెను విరమింపజేశారు. దీంతో సోమవారం నుంచి కార్మికులు తిరిగి విధుల్లో చేరారు. సమ్మె విజయవంతం కావడంపై సీటూ మండల కార్యదర్శి సుందర్‌రావు కార్మికులకు అభినందనలు తెలిపారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న కిరణ్

ఎటపాక: తోటపల్లిలో సీపీఎం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని, ఈ మేరకు వరకూ పోరాటం చేస్తామన్నారు. ఇందు కోసం ఎటపాక నుంచి జూన్ 20 న మహా పాదయాత్ర చేపడతామన్నారు. రానున్న వరదలకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నాగేశ్వరరావు, మాధవరావు, బాలకృష్ణ, వీరమ్మ, పద్మ, రామారావు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై అవగాహన



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసు లోవకుమారి

వై.రామవరం: మండలంలోని పనసలపాలెంలో సీఐ వై.రాంబాబు ఆదేశాల మేరకు మహిళా పోలీసు లోవ కుమారి సోమవారం సందర్శించారు. గ్రామస్తులకు దిశా యాప్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఆమె మట్లాడుతూ ఆన్‌లైన్‌లో రుణాల యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. దిశా యాప్ ఉపయోగాలను వివరించారు. మహిళలు తమ స్మార్ట్‌ఫోన్‌లలో దిశా యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఉన్నత విద్య అభ్యసించాలని సూచించారు. పోక్సో తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వర స్వామి మాలధారణ

దేవరాపల్లి: మారేపల్లి గ్రామం నమో వెంకటేశాయ, నమో శ్రీనివాసాయ, గోవింద నామస్మరణంతో మార్మోగింది. ఇక్కడ సోమవారం పలువురు భక్తులు వేంకటేశ్వర స్వామి మాలాధారణ చేశారు. ఈ నెల 31న గ్రామానికి సమీపంలో శారదానది తీరాన కొండపై వేంచేసియున్న శ్రీదేవి శ్రీభూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయ పునఃప్రతిష్ఠను పురస్కరించుకుని గ్రామానికి చెందిన 25 మంది భక్తులు స్థానిక రామాలయంలో గ్రామ పురోహితులు జోస్యుల ఫణీంద్ర శర్మ సమక్షంలో మలాధారణ చేశారు. తొమ్మిది రోజులపాటు అత్యంత నియమ నిష్ఠలతో దీక్ష చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

సీఆర్‌పీఎఫ్ సేవలు



పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరంలో సోమవారం సీఆర్‌పీఎఫ్ డి42– బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో పేదలకు బోజనం పేకట్లు పంపిణీ చేశారు. ఒకపక్క వారపు సంత, మరోపక్క ప్రభుత్వ కార్యాలయాల పనులపై వచ్చిన సుమారు 190 మందికి భోజన ప్యాకెట్లను అందజేశారు. సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంటు ఎం.ఎల్.నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ సిబ్బంది పాల్గొన్నారు.

మోదమాంబకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

రావికమతం: గడబపాలెం మోదమాంబ ఆలయంలో అమ్మవారి మాలధారణ భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా వంద మందికి పైగా మాలధారణ చేసిన భక్తులు పాల్గొన్నారు. మంగళవారం ఘటాల ప్రదర్శన, సంబరం నిర్వహించనున్నారు.